
# కానుక

నిప్పులాంటి నిజాలు.. డిసెంబర్, 2001



"సాంబమూర్తిగారి నుండి కబురు ఏమైనా వచ్చిందా?" అప్పుడే బజారు నుండి వచ్చిన రవీంద్ర అడిగేసరికి 'లేద'ని సమాధానమిచ్చింది సాధన.

"ఈరోజు కంపెనీలో ఓవర్‌టైమ్ చేయవలసి ఉంటుందన్నారు. బహుశా లేదేమో..?!"

రవీంద్ర, సాధన భార్యాభర్తలు. రవీంద్రకి అహ్మదాబాద్‌లోని ఓ పెద్ద ప్రయివేట్ కంపెనీలో చిన్నఉద్యోగం! సాధన హౌస్‌వైఫ్!

జీవితాన్ని తమకనుకూలంగా మలచుకోవడం, నిరాశను విడనాడి సంతోషాన్ని నలుగురితో పంచుకోవడం నేర్చుకోవడంతో- వారిది చిన్నజీవితమైనా 'సక్సెస్‌ఫుల్ పెయిర్' అని అందరూ

చెప్పుకొనే స్థాయి కెదిగారు. బ్రతుకులోని మాధుర్యాన్ని అనుభవించాలనే తపన ఇద్దరిలో ఉండటంతో చేదోడువాదోడుగా ఉంటూ, ఒకరికి ఒకరై- తమ సంసారాన్ని స్వర్గమయం చేసుకుంటున్నారు. భార్యను ప్రేమించడం, ప్రేమింపబడటం రవీంద్రకు ఇష్టమైతే... మనసెరిగి నడుచుకొనే సాధన అతని మనసంతా తానేనని గ్రహించి పొంగిపోయేది.

సాంబమూర్తి ఆఫీసు మేనేజరుగా హైదరాబాద్ నుండి బదిలీ మీద అహ్మదాబాద్‌లో రవీంద్ర పనిచేస్తున్న ఆఫీసుకు వచ్చాడు. భార్య హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తుండటంతో భార్యాపిల్లల్ని వదిలి ప్రస్తుతానికి అక్కడికి రావాల్సివచ్చింది.

మంచితనంతో, సిన్సియారిటీతో రవీంద్ర తన బాస్ సాంబమూర్తిని కొద్దిరోజులలోనే ఆకట్టుకున్నాడు. అదీ తెలుగువాడు కావడంతో మరింత దగ్గరయ్యాడు. ఒంటరిగా ఉంటున్న సాంబమూర్తిని సెలవురోజులలో భోజనానికి తన ఇంటికి ఆహ్వానించేవాడు.

రవీంద్ర, సాధనలు ఒక 'ఎల్డర్లీ మేన్‌గా' తనపట్ల చూపించే ఆపేక్ష మొదట్లో వింతగా అనిపించినా- తరువాత వారిపట్ల సాంబమూర్తికి ఓ విధమైన మాటల్లో చెప్పలేని మమకారం ఏర్పడింది.

రానురాను రవీంద్ర, సాధనలు సాంబమూర్తి స్నేహితుల్లో అతి ముఖ్యులైపోయారు.

• • •

ఆరోజు సాధన పుట్టినరోజు!

సాంబమూర్తిని ఆరోజు తమతో గడపమని తన ఇంటికి ఆహ్వానించాడు రవీంద్ర.

వారి అభిమానానికి ఎంతగానో మురిసిపోయాడు సాంబమూర్తి.

'ఆమెకు ఏదో ఒకటి బహుమానంగా ఇవ్వాలి. అదే సమయంలో ఉభయులకీ ఉపయోగపడే వస్తువైతే బాగుంటుంది' అనుకొని సాంబమూర్తి ఒక 'బహుమతి' కొని తెచ్చాడు.

సాంబమూర్తి రాకను గమనించిన సాధన, రవీంద్రలు సంతోషంతో అతన్ని సాదరంగా ఆహ్వానించారు.

అదేరోజు శ్రావణ పూర్ణిమ కూడ కావడంతో- సాధన సాంబమూర్తి చేతికి రాఖీ కడుతూ...

"అధికారి అన్న అహం, డాబు లేకుండా మధ్యతరగతి వారమైన మమ్మల్ని ఇంతగా ఆదరిస్తున్న మీ సంస్కారానికి జోహార్లు! మీలో నేను నిజమైన సోదరుని చూడగలుగుతున్నాను" అంది.

"సాధనా... థాంక్యూ వెరీమచ్! ప్లీజ్ కీప్ ద ఫ్లాగ్ ఫ్లయింగ్! ఒక మంచిఅమ్మాయి అన్నగా ఆదరించి నా చేతికి రాఖీ కట్టిందంటే ఈనాటి నుండి నా బాధ్యత మరింత పెరిగిందన్న మాట!" అంటూ సాంబమూర్తి ఆనందంతో తన 'ప్రెజెంటేషన్' ఆమెకు అందజేశాడు.

• • •

విధి వక్రించింది!

ప్రకృతికి తమమీద కినుకో, లేక కోపమో తెలీదుగాని- అత్యంత ఆనందోత్సాహాలతో 'రిపబ్లిక్ డే' దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్న అహమ్మదాబాద్ మహానగరంలో భూమాత ఒక్కసారి గర్జించేసరికి ఆ ప్రాంతమంతా ఉలిక్కిపడింది.

ఆ భూకంపం ధాటికి ఆ ప్రాంతమంతా అతలాకుతలమై కొన్ని సెకన్లలో మరుభూమిగా మారిపోయింది.

ఆ ప్రకృతి విలయ తాండవానికి చిన్నచిన్న గుడిసెల నుండి పెద్దపెద్ద మిద్దెల వరకు, ఓ మాదిరి ఇళ్ల నుండి మహాసౌధాల వరకూ అన్నీ నేలమట్టమైపోయాయి. ఆ ప్రాంతమంతా చూడ్డానికే చాలా భయంకరంగా కన్పిస్తోంది. అక్కడ ఏ ఒక్కరైనా బ్రతికి బట్టకడతారనుకుంటే అది కేవలం అత్యాశే అవుతుంది.

సరిగ్గా రవీంద్ర, సాధనలు నివాసముంటున్న ఆ ప్రాంతంలో కూడా భూకంపం వచ్చి మచ్చుకు కూడా మిగలకుండా అన్ని ఇళ్లూ నేలమట్టమైపోయాయి.

ఆఫీసు పనిమీద క్యాంప్‌లో ఉన్న సాంబమూర్తి 'అహమ్మదాబాద్‌లో భూకంపం' అన్న వార్త విని- ఆతృతగా సరాసరి ఆ ప్రాంతానికి చేరుకున్నాడు.

శ్మశాన వైరాగ్యాన్ని కలుగజేస్తున్న అక్కడికి రక్షక దళాలు, స్వచ్ఛంద సంస్థలు, భారత సైనిక దళాలు అప్పుడే రంగప్రవేశం చేశాయి. శిథిలాలలో కూరుకుపోయిన మనుషుల్ని బయటికి తీసే పనుల్ని యుద్ధ ప్రాతిపదికన చేబడితే... కేవలం కాళ్లుచేతులు విరిగిన అభాగ్యులు, ప్రాణాలు కోల్పోయిన విగతజీవులు ఒక్కొక్కరిగా బయటపడుతున్నారు.

ఆ ప్రాంతాన్ని చూసిన సాంబమూర్తి- రవీంద్ర, సాధనలు కూడా ఆ శకలాలలో ఎక్కడో సమాధి అయిపోయి ఉంటారని ఎంతో బాధపడ్డాడు.

వెలికి తీసిన శవాలను ఒక్కొక్కటే వరుసగా పరుండబెడుతున్నారు.

తమవారిని చూసుకోవడానికి వచ్చినవారితో, వారి రోదనలతో ఆ ప్రాంతమంతా విషాదమయంగా ఉంది. కుప్పలుగా ఉన్న ఆ శవాలలో తన ప్రాణస్నేహితులు ఉన్నారేమోనన్న భయం, 'లేకుండా ఉంటే బాగుండు'నన్న ఆశ! ఒక్కక్షణం ఆశ-నిరాశల మధ్య ఆవేదన ననుభవించాడు సాంబమూర్తి.

ఒక్కసారి సాధన మాటలు గుర్తుకువచ్చాయి-

"అన్నయ్యా! నేను ఈ రాఖీ నీ చేతికి ఎందుకు కట్టానో తెల్సా? మేము ఎప్పుడైనా కష్టాలలో ఉంటే అభయహస్తం అందిస్తావని!"

సాంబమూర్తి మనస్సు చివుక్కుమంది. అంతలోనే మదిలో ఏదో స్ఫురించింది. వెంటనే తన సెల్‌ఫోన్ తీసి ఓ నెంబర్ డయల్ చేశాడు.

గుండె దడదడ లాడుతోంది. అవతల ఫోన్ రింగ్ అవుతోంది. వారు సజీవంగా ఉండి 'హలో...' చెబితే బాగుండు!

కొన్ని నిమిషాలు రింగ్ అయి... ఆగిపోయింది.

ఆశ చావడం లేదు.

మరలా డయల్ చేశాడు.

నో రెస్పాన్స్!

మరలా మరలా డయల్ చేస్తూనే ఉన్నాడు.

చివరికి ఆశ-నిరాశల మధ్య, చావు-బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఓ గొంతు మూలుగుతూ "హలో..!" అంది.

సాంబమూర్తికి ప్రాణం లేచి వచ్చినట్లయింది.

"హలో... రవీ! నేను... సాంబుని మాట్లాడుతున్నా! ఎక్కడ ఉన్నావ్... ఎలా ఉన్నావ్?"

"సార్! మమ్మల్ని బయటకు తీయండి. ఇక్కడ ఊపిరాడక చచ్చిపోతున్నాము!"

"సాధన ఎలా ఉంది?"

"ఏమీ తెలియడం లేదు. ఈ శిథిలాలలో చిక్కుకుపోయాం!"

"మీరున్న లొకేషన్ తెలియడం లేదిక్కడ!"

సమాధానం రాకపోవడంతో సాంబమూర్తికి ఏమీతోచడం లేదు.

అంతలో... మెరుపు లాంటి ఆలోచన!

"సరే... మేమంతా ఆ పనిమీదే ఉన్నాం. కానీ, నువ్వు నీ సెల్‌ఫోన్‌ను ఆన్‌లోనే ఉంచు!" అంటూ సహాయక చర్యలను చేపట్టిన సిబ్బందిని అప్రమత్తం చేశాడు. రవీంద్ర నెంబరుకు పదేపదే డయల్ చేస్తున్నాడు. ఎక్కడో సుదూరంలో చిన్నగా ఫోన్‌రింగ్స్ వినబడుతున్నాయ్.

ఆ శబ్దాన్ని నెమ్మదిగా పసికడుతూ అక్కడి శిథిలాలను తొలగిస్తున్నాయి బుల్‌డోజర్లు!

సైన్యం, ఆఫీస్ స్టాఫ్, స్వచ్ఛంద సంస్థలు వారికి సహాయం చేస్తున్నాయి.

శకలాలు ఒక్కటి ఒక్కటిగా తొలగించబడుతున్నాయి. ఫోన్ రింగ్‌లు స్పష్టంగా... మరింత స్పష్టంగా... మరికొంత స్పష్టంగా వినబడుతున్నాయి.

అందరిలోనూ తృప్తి కల్గుతోంది. చివరికి కొనఊపిరితో... మృత్యువుతో యుద్ధం చేస్తూ... సడలినధైర్యంతో ఉన్న రవీంద్ర, సాధనలు బయటి ప్రపంచాన్ని చూడగలిగారు.

"అన్నయ్యా! నీవిచ్చిన ఈ సెల్‌ఫోన్ మమ్మల్ని ఇంతగా కాపాడుతుందని ఆనాడు ఊహించలేదు. కాని, మంచిమనసుతో నీవిచ్చిన ఈ 'కానుక' మమ్మల్నే కాదు- నా కడుపులో పెరుగుతున్న నీ మేనల్లుడుని కూడా రక్షించింది. అందుకే వాడికి 'సెల్‌ఫోన్ సాంబు' అని పేరు పెడతాను!"

... అని సాధన అనగానే సాంబమూర్తి వెంటనే అందుకొని-

"నేను కానుకగా ఇచ్చిన ఈ సెల్‌ఫోన్ మిమ్మల్ని సేవ్ చేసిందన్నమాట! గాడ్ ఈజ్ గ్రేట్... యు హావ్ టు గీవ్ మి ట్రీట్!" అనగానే అందరూ గొల్లుమన్నారు.